# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 10-08-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. బెంగళూరు పర్యటనలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మూడు వందే భారత్ రైళ్లను ఈరోజు ప్రారంభించారు.
2. ప్రభుత్వాసుప్రతుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ అధికారులను ఆదేశించారు.
3. ఎయిమ్స్‌కు ఎక్కువ మంది రోగులు వస్తున్నందున, పడకలు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి అధికారులకు సూచించారు.
4. రాష్ట్రంలో 50 ఇంటిగ్రేటెడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు.

==========================

బెంగళూరు పర్యటనలో భాగంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డి.కె శివకుమార్‌లతో కలిసి మూడు వందే భారత్ రైళ్లను ఈరోజు జెండా ఊపి ప్రారంభించారు. బెంగళూరు నుంచి బెళగావి, అమృత్సర్ నుండి శ్రీ మాతా వైష్ణో దేవి కాత్రా, నాగ్‌పూర్ నుండి పూణేకు ఈ రైళ్లు రకపోకలు సాగించనున్నాయి. అదేవిధంగా 15 వేల 610 కోట్ల రూపాయల విలువైన బెంగళూరు మెట్రో ఫేజ్ 3 ప్రాజెక్ట్‌కు ప్రధాని శంఖుస్థాపన చేశారు. ఈ ప్రాజెక్ట్‌లో మొత్తం 44 కిలో మీటర్లకుపైగా రైలు మార్గం, 31 ఎలివేటెడ్ స్టేషన్లు చేపట్టనున్నారు. అనంతరం ప్రధాన మంత్రి ఆర్.వి రోడ్ నుంచి ఎలక్ట్రానిక్ సిటీ వరకూ మెట్రోలో ప్రయాణించారు.

-------------------------

ప్రభుత్వాసుప్రతుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గుంటూరు జిల్లాలోని తెనాలి ప్రభుత్వ వైద్యశాలను ఆయన ఈ రోజు ఆకస్మిక తనిఖీ చేసారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. ఆసుపత్రిలో సౌకర్యాలను పరిశీలించేందుకు ఆకస్మికంగా సందర్శించినట్లు చెప్పారు. ఆసుపత్రిలో సౌకర్యాలు, పరిశుభ్రతలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ముందుగా ఆస్పత్రిలోని అత్యవసర వార్డు సహా క్యాజువాలటీలకు వెళ్లి అక్కడ చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. కొన్ని విభాగాల్లో వైద్యుల కొరత ఉందని త్వరలో భర్తీ చేస్తామని చెప్పారు.

-------------------------

ఎయిమ్స్ ఆసుపత్రిలో పడకలు పెంచేందుకు తగిన చర్యలు తీసుకోవాలని పార్లమెంటు సభ్యులు వల్లభనేని బాలశౌరి అధికారులకు సూచించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎయిమ్స్ పాలకమండలి సమావేశం నిన్న నిర్వహించారు. విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ తో కలిసి ఈ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. కిడ్నీ సంబంధిత సమస్యలతో ఎక్కువ మంది రోగులు వస్తున్నందున, వారికి అవసరమైన డయాలసిస్ పరికరాలు అందుబాటులో ఉంచాలని ఎయిమ్స్ డైరెక్టర్‌ను కోరారు. కృష్ణా జిల్లాలోని పామర్రు నియోజకవర్గంలో ఎయిమ్స్ శాటిలైట్ కేంద్రాన్ని నెలకొల్పాలన్నారు. తద్వారా గ్రామీణ ప్రాంతాలలోని రోగులకు అవసరమైన వైద్య సేవలు అందుతాయని తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో 50 ఇంటిగ్రేటెడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను త్వరలో ఏర్పాటు చేస్తున్నట్లు స్వచ్ఛాంధ్రప్రదేశ్ కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామ్ తెలిపారు. తిరుపతిలో పాత్రికేయులతో ఈరోజు ఆయన మాట్లాడుతూ .. దేశంలోనే మొట్టమొదటగా రీసైక్లింగ్ పార్క్‌ను తిరుపతిలో కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే కంప్రెస్డ్ బయోగ్యాస్‌కు శ్రీకారం చుట్టామన్నారు. రాష్ట్రాన్ని స్వచ్ఛాంధ్రప్రదేశ్‌గా మారుస్తామని పేర్కొంటూ...

.. వాయిస్... 32 సెకన్లు

---------------------------

తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో పౌరసరఫరాల శాఖ గోదాములు, రేషన్ దుకాణాలు, పాఠశాలలు, వసతి గృహాలను రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు జి.దేవి ఈ రోజు తనిఖీలు నిర్వహించారు. పేదలకు నాణ్యమైన బియ్యం సరఫరా, విద్యార్థులకు పౌష్టికాహారం అందించడానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థులకు అందిస్తున్న నాణ్యమైన సమతుల ఆహారం సక్రమంగా అందించడమే లక్ష్యంగా తనిఖీలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పేదలకు ప్రభుత్వం ఆహార భద్రత చట్టం కింద కోట్ల రూపాయలు వెచ్చించి అందిస్తున్న ఆహారంలో నాణ్యత తప్పనిసరి అని తెలియజేస్తూ...

..వాయిస్...25 సెకన్లు

---------------------------

దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను యువత తెలుసుకోవాలని అనంతపురం కేంద్రీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఎస్.ఎ.కోరి తెలిపారు. అనంతపురంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ రోజు నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్.ఎ కోరి మాట్లాడుతూ జాతీయ జెండా విశిష్టత, స్వాతంత్ర్య సమరయోధుల గొప్పతనం తెలియజేస్తూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.

---------------------------

సంప్రదాయ వ్యవసాయంలో శాస్త్రీయ దృక్పథం, పర్యావరణ పరిరక్షణ, రసాయన రహిత ఆహారాన్ని అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకాన్ని ప్రారంభించిందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. విజయవాడలో కలక్టరేట్ ప్రాంగణంలో ఈరోజు అయన మాట్లాడుతూ... జిల్లాలో రైతులు ప్రకృతి వ్యవసాయాన్ని అనుసరించి సాగు చేసేలా చైతన్యవంతం చేసే కార్యక్రమాలను

చేపట్టామన్నారు. ప్రకృతి వ్యవసాయంపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించడంతో పాటు, ప్రస్తుతం నూరుశాతం ప్రకృతి వ్యవసాయం అమలు చేసేలా చర్యలు చేపట్టామన్నారు. భవిష్యత్ తరాలు వ్యాధుల బారినపడకుండా ఉండాలంటే ప్రకృతి వ్యవసాయం ఒక్కటే పరిష్కారమని తెలిపారు.

---------------------------

'మా తెలుగుతల్లికి మల్లెపూ దండ' అని తేట తెలుగులో రాసి.. తెలుగు ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించిన ప్రముఖ రచయిత శంకరంబాడి సుందరాచారి జయంతి ఈరోజు. ఈ సందర్భంగా తెలుగు సాహితీ రంగానికి ఆయన చేసిన సేవలను ప్రజలు స్మరించుకుంటున్నారు. 1914 ఆగస్టు 10వ తేదీన నాటి చిత్తూరుజిల్లా తిరుపతిలో జన్మించిన ఆయనకు తెలుగు రచయితల్లో ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఉపాధ్యాయునిగా, పాఠశాల పర్యవేక్షకునిగా బాధ్యతలు నిర్వహించిన ఆయన ఆంధ్రపత్రికలో కూడా పనిచేశారు. 1977 ఏప్రిల్ 8వ తేదీన సుందరాచారి తుదిశ్వాస విడిచారు. సుందరాచారి కలం నుంచి జాలువారిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గీతం 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' విందామా...

వాయిస్... 30 సెకన్లు

---------------------------

ఉత్తర ఆంధ్రా కర్ణాటక, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 4.5 కిలో మీటర్ల మధ్య ఎత్తులో విస్తరించి ఉందని, పశ్చిమ మధ్య వాయువ్య బంగాళాఖాతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, దీని ప్రభావంతో ఈనెల 13వ తేదీ నాటికి బంగాళాఖాతంలో అల్పపడీనం ఏర్పడే అవకాశముందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీంతో ఆంధ్రప్రదేశ్‌లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి ఎల్. నారాయణ తెలియజేస్తూ....

వాయిస్...20 సెకన్లు

=====================